కథా కౌముది



# చెదిరిన కల

- గంటి భానుమతి

**కుటుంబాన్ని**, చిన్నపిల్లల భారాన్ని అవలీలగా భుజానికెత్తుకుని, బాధ్యత అనే విలువను శిలువగా మోసిన రోజుల్లో కూడా నేను కుంగిపోలేదు.

కానీ శాంత ఈ ఇంట్లో కోడలి హోదాలో అడుగు పెట్టినప్పటినుంచీ ఏదో అలజడి. ఆమె మాటలు, చేతలు..తల్లిదండ్రుల గొప్పలు పదే పదే ఆమె నోట్లోంచి వస్తూంటే, మనసు కుంగి పోడం మొదలుపెట్టింది.

ఈ మానసిక సంఘర్షణకి ఫుల్ స్టాప్ పెట్టేయాలి. లేకపోతే ఈ సంఘర్షణకి నేనే బలి అయిపోయేలా ఉన్నాను.

యుద్ధం పక్కదేశంతోనో, శత్రువులతోనో అయితే చెయ్యచ్చు. కానీ యుద్ధం అనుక్షణం ఇంట్లో వాళ్ళతో అయితే..ఎలా జీవితం కొనసాగించగలను? ఇంకా పాకం ముదరకముందే, గాలివానా పెద్దదవకుండానే జాగ్రత్త పడాలి.

నా కూతురు శ్రావ్య పెళ్ళయ్యాక అత్తారింటికి వె ళ్తూంటే ఇంట్లో ఎలా మసలుకోవాలో చెప్పాను.

ఇప్పుడు శాంత కి కూడా అలాగే చెప్పాల్సివస్తోంది. శాంత కోడలే..అయితేనేం, కూతురిగానే నేను భావించాను. కానీ ఆమె మాత్రం నాలో వాళ్ళ అమ్మని చూసుకోలేకపోతోంది..అది వేరే సంగతి.

ఈ ప్రపంచం, సమాజం, ఇంత ఆధునికతను చూపిస్తూ..అన్నివిధాలా అభివృద్ధి చెందుతూంటే, పాత కాలం అత్తాకోడళ్ళల్లాగా, పరోక్షంగా, ప్రత్యక్షంగా సూటిపోటీ మాటలనుకుంటూ కాలం గడిపేయడం నాకిష్టం లేదు.

అత్తా కోడళ్ళు అంటే స్నేహితుల్లా ఉండాలి. అన్నీ చర్చించుకుంటూ, మాట్లాడుకుంటూ, కలిసి బైటికి వెళుతూ హాయిగా నవ్వుతూ, తుళ్ళుతూ ఉండాలి. ఇది కలే కావచ్చు కానీ నిజం చెయ్యాలన్నదే నా తాపత్రయం.

మేం చదువుకున్న వాళ్ళం. ఇగోల కోణాల్లో ఇరుక్కుపోయి, అహంకారాల్ల ఉచ్చుల్లో ఊపిరిడకుండా బ్రతకాల్సిన ఖర్మ ఏం పట్టింది?

కోడలు ఈ ఇంట్లో ఎలా ఉండాలో చెప్పడానికి తాపత్రయ పడుతున్నానంటే, అది అత్త అనే పదం లోంచి వచ్చిన అహంకారం కాదు. చేజారిపోతున్న అభిమానాన్ని కాపాడుకోడానికి నేను పడుతున్న ఓ చిన్న తాపత్రయం మాత్రమే.

ఈ ఇంటి పెద్దగా, నా బాధ్యతగా కొన్ని శాంతితో చెప్పాల్సినవి ఉన్నాయి. ఆ తర్వాత తరానికి ట్రాన్స్ఫర్ చెయ్యాల్సిన కొన్ని అప్పగింతలూ ఉన్నాయి. కానీ ఇంతవరకూ అవకాశమే రాలేదు. ఎప్పటికప్పుడు నా మాటల్ని నా పెదవి దాటనియ్యని పరిస్థితులే

ఎదురవుతున్నాయి.

కానీ ఇవాళ అనుకున్న సమయం వచ్చినట్లనిపించింది. ఇంట్లో శాంతి నేనే ఉన్నాం. సమయం జారిపోకముందే తొందరపడాలి.

శాంతి ని పిలిచాను.

"పిలిచారా అత్తయ్యా?" అంటూ వెంటనే వచ్చింది. సంతోషంతో ఉబ్బిపోయాను. అయినా గంభీరంగా చూసి, ఆమెను కూర్చోమన్నాను. కూర్చుంది.

పెద్ద ఉపోద్ఘాతం లేకుండానే, డైరెక్ట్ గా టాపిక్ లోకి వచ్చాను.

"చూడు శాంతీ, మనం అందరం ఈ ఇంటికి చెందినవాళ్ళం. ఈ కప్పు కింద ఉండవలసిన వాళ్ళం.

నేనొప్పుకుంటాను, మనది సమానస్థాయి వియ్యం కాదని. మన బేసిక్ కల్చర్ లోనే చాలా వ్యత్యాసం ఉందని. నువ్వూ, నా కొడుకు రాజేశ్ ప్రేమించుకున్నప్పుడు ఇవన్నీ నీకు అడ్డురాలేదు. కానీ మీ పెళ్ళయ్యాక ఇవన్నీ నీ నా సంబంధాల మధ్య అడ్డొస్తున్నాయి.

ఇంతవరకూ ఫరవాలేదు. చిన్న చిన్న ఫ్రిక్షన్స్ ని మాత్రమే చూశాను..తట్టుకున్నాను.

కానీ ఇంక మీదట అది పెద్దగా రాజుకుని మనల్ని మండించేంతటి పరిస్థితి రాకూడదు. నువ్వూ నేనూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ అవతలి వాళ్ళ కోణం లోంచి కూడా ఆలోచిస్తూ, పరస్పరం గౌరవించుకుంటూ జీవిద్దాం.

నిన్ను ఇలా కూర్చోపెట్టి క్లాస్ తీసుకోవాల్సిన అవసరం ఏముందని నువు అనుకోవచ్చు. పెళ్ళిలో, పెళ్ళయ్యాక ఈ ఏడాదిలో నీవి, మీ పేరెంట్స్ మాటలు, బిహేవియర్ నన్ను, నా కూతురు శ్రావ్యని కష్టపెట్టాయి. వెనక్కి తీసుకురాలేని సంధించిన బాణాల్లాటి మాటలు అవన్నీ.

మేం కూడా అలా అనలేమా? అలా అనడం ఎదురుతిరగడం ఎంతసేపు? కానీ తర్వాత ఏం జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టం కాదు. మాటల యుద్ధం మొదలవుతుంది. ఒకసారి మొదలయ్యిందంటే మాటల వాడకంలో పొదుపుండదు.

భాష కున్న పరిమితి చాలా తక్కువ. అయినాకూడా ఆ పరిమితిలోనే, అందులోనే ఆ మాటల్ని, మన సంబంధాల్ని,బాంధవ్యాల్ని, బంధుత్వాన్ని, కాపాడుకునే ఓ ఆయుధంలా వాడుకోవాలి.

లేకపోతే మాటమీద మాట పెరిగి ఎన్నో వస్తాయి. ఒక్కసారిగా మనసుకు కప్పుకున్న సంస్కారపు వలువలు, విలువలు జారిపోతాయి. అప్పుడు మనసు యొక్క నగ్నత్వం, అసలు స్వరూపం బైట పడిపోతుంది. నైతిక విలువలు పడిపోతాయి.

తెల్లారి లేస్తే మొహామొహాలు చూసుకోవలసినవాళ్ళం. మాటల విషయంలో పరిధి దాటకుండా ఉంటేనే మనకి మంచిది. లేకపోతే తప్పులు జరిగిపోతాయి.

మనం సంపాదించుకున్న జ్ఞానంలో తప్పులుంటే దాన్ని మనం సవరించుకోవచ్చు. జీవితంలో అతి ముఖ్యమైన పాత్ర వహించే నీతిలో అతిక్రమణలుంటే సరిదిద్దుకోగలవా? దానికి కాన్షస్ ఉండాలి.

బయట నుంచీ చూస్తే, ఈ ఇల్లు, కుటుంబం, మనుషులు ఎంతో బాగున్నట్లు కనిపిస్తున్నా, అది అద్దంలో మనం చూస్తున్న బింబం మాత్రమే అవుతోంది. ఇప్పుడిప్పుడే కుటుంబం అడుగునుంచి మెల్లి మెల్లిగా కుళ్ళడం మొదలవుతోంది.

ఎందుకంటే, శ్రావ్య వచ్చిన ప్రతీసారీ కళ్ళనీళ్ళతో వెళుతోంది. అసలు ఈ పరిస్థితి ఎందుకు రావాలి? మనలో మనకి ఎందుకింత అసమానతలు?

నువ్వూ, నేనూ, శ్రావ్యా అందరం ఒక జాతి వాళ్ళమే కదా! మనలోని రక్తం, మాంసం, కండ, చర్మం అన్నీ ఒకటే కదా! అలాంటప్పుడు మనం ఫ్రెండ్స్ లా ఉండాలికానీ ఈ హెచ్చు తగ్గులు ఎందుకు? కానీ నువ్వు మా మీద అధికారం చెలాయిస్తావు.

ఇక్కడే.ఇక్కడే నువ్వు నీ పరిధి దాటుతున్నావనిపిస్తుంది. నిజానికి నన్నూ, శ్రావ్యనీ అనే అధికారం నీకు లేదు. కానీ

నిస్సహాయులం. ఇంతవరకూ జరిగిన దానికి నిన్ను క్షమించేసి ఓ అత్తగారిలా నా పెద్దరికం నిలబెట్టుకుంటాను.

జీవితాంతం కలిసి ఉండాల్సిన వాళ్ళం కాబట్టి మనం అడ్జస్ట్ అవాలి. లేకపోతే చాలా కష్టం.

పైగా నీదంతా టేకిట్ ఈజీ పాలసీ. కమిట్‌మెంట్ తక్కువ. నేనలా ఉండలేను. ఈ టేకిట్ ఈజీ పాలసీ వెనుక భరించలేనంత ఇన్‌సెక్యూరిటీ కొందరి కయితే, అహంకారం కొందరికి. దీని ఫలితం అనుభవించాల్సింది రేపో ఎప్పుడో కాదు, ఈ రోజే.

అందుకే, నువ్వు నేనూ మన సంబంధాల విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుందాం. మధ్య మధ్యలో మన తప్పుల్ని, సరిదిద్దుకుంటు, జీవిస్తుంటే మనం మన అస్థిత్వాన్ని కాపాడుకోగలం. కుటుంబంలో కలతలు కూడా ఉండవు.

మన మనసులు ఇంకా కలుషితం కాకముందే, మనలో మనకి అంతర్యుద్ధం ఇంకా పెరగకముందే మేల్కోవాల్సిన సమయం వచ్చింది.

ఇప్పుడు కనుక మేల్కొనకపోతే, ఈ విషయాల్ని దాటేస్తూ తాత్సారం చేస్తూ, రోజులు గడిపేస్తే, మనకి వ్యక్తిగత బద్ధకం వచ్చేస్తుంది. తర్వాత దానివల్ల కలిగే ఫలితాలకి విషాదం అని ఓ పేరు పెట్టుకుని ఆత్మవంచన చేసుకుంటూ బతకాల్సిన పరిస్థితి, దుస్థితి వచ్చేస్తుంది.

ఇవన్నీ ఈ ఇంట్లో జరగకుండా ఉండాలి.

మనం ఈ ఆధునిక యుగంలో ఉంటున్నాం. విశాలంగా ఆలోచించి ప్రతీదానికీ పెద్ద మార్జిన్ ఇవ్వాలి.

శాంతీ! నేను చెప్పింది పూర్తిగా అర్థం అయిందనుకుంటాను. నువ్వు ఈ ఇంటి కోడలువి కాదు. నా కూతురివి. నాతో ప్రతీ విషయం మీ అమ్మ తో ఎలా చర్చిస్తావో అలాగే చర్చించే స్వేచ్ఛ నీ కుంది."

శాంతి ఒక్కసారిగా లేచి నా చేతులు పట్టుకుంది.

"నిజం అత్తయ్యా, నేను చాల అజ్ఞానంగా ప్రవర్తించాను. ఈ క్షణం నించీ మనం అత్తా కోడళ్ళం కాదు..తల్లీ కూతుళ్ళం. ఆ బంధం నిలపడానికే ప్రయత్నిస్తాను."

నా కళ్ళు తడి అయ్యాయి. ఆనందంగా చూశాను. ఇదే..ఇదే నేను కోరుకున్నది. ఈ మార్పే ఓ తల్లిగా నాక్కావల్సింది. సంతృప్తిగా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

"థాంక్యూ శాంతీ..థాంక్యూ..నన్ను, నా మనసునీ చాలా తొందరగానే గ్రహించావు...ఇప్పటినుంచీ ఈ ఇంటిని ఆనందనిలయం గా మార్చేద్దాం." అన్నాను విచలిత స్వరంతో.

"హలో.." అంటుంటే ఉలిక్కి పడ్డాను. ఎదురుగా శాంతి.

"ఏంటీ? మీలో మీరే మాట్లాడుకుంటున్నారు..." ఏదో లోకంలోంచి అప్పుడే ఊడిపడ్డట్టుగా అనిపించింది. అదే ఫీలింగ్ తో శాంతిని చూశాను. అయోమయంలో పడ్డాను.

శాంతి వింతగా నన్నే చూస్తోంది.

"మా మమ్మీ ఫోన్ చేసింది. డాడీ సింగపూర్ నుంచీ డైమండ్ నెక్లెస్, గాజులు తెచ్చారుట. వచ్చి తీసుకెళ్ళమంది. రాజేశ్ కి చెప్పాను మా ఇంటికి వచ్చేయమని. మేము రాత్రికి అక్కడే ఉంటాం. మీ వంట మీరు చేసుకోండి...." నా సమాధానం కోసం చూడకుండా, ఎత్తు చెప్పులు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయింది.

అంత పెద్ద హాల్లో ఒక్కదాన్ని అయిపోయాను.

శాంతి కి నేనేం చెప్పలేదా? మరి ఇంతవరకూ ఎవరితో మాట్లాడాను? నాలో నేనే మాట్లాడుకున్నానా? మరీ ఇంత డిప్రెషన్‌లోకి వెళ్ళిపోతున్నానా?

నేను పిలిస్తే శాంతి రాలేదా? శాంతి వచ్చిందని నేనెలా అనుకున్నాను? అయినా నేను చెప్పాలనుకున్నది పెదవి దాటకపోవడం ఇది మొదటి సారి కాదుకదా!

ఇవాళిది కాకతాళీయంగా జరిగింది కాదుకదా! తెలిసిందే జరిగింది. ఇందులో నిరాశ పడ్డానికేముంది? గెలవడం తెలుసు అన్న భ్రమలో ఉన్నాను. ఓడిపోయే ధైర్యం కూడా అందులోంచే వచ్చింది.మరో అవకాశం కోసం చూస్తాను.

శాంతి, వాళ్ళ మమ్మీ ఇంటినించి వచ్చాకా, దగ్గర కూర్చోపెట్టుకుని, అత్తా, కోడలు, ఆడపడుచు సఖ్యతతో ఫ్రెండ్స్ లా ఎలా ఉండాలో చెప్పాను.

ఇది కల ఐనా ఊహ ఐనా ఓ అందమైనది.

అలా అనుకుంటుంటుఉంటే, మళ్ళా మనసు కుంగిపోయింది, అది నిజం కాదేమోనని. నిరాశ చుట్టేసింది ఒక్క సారిగా. రాలుతున్న కన్నీటికి అంకుశం వేయదల్చుకోలేదు.

దానికి స్వేచ్ఛ నిచ్చేశాను. ఇంక దానిష్టం.

